క్లుప్తంగా

పేరు తొలగించొద్దు



గార్ల: రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు యునివర్సిటీ పేరు తొలగించవద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం గార్లలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ప్రదర్శన, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు రమేష్‌బాబు, వేణుగోపాల్, సత్యం, రాంబాబు పాల్గొన్నారు.

ఆసక్తి పెంచేలా బోధన చేయాలి

మరిపెడ రూరల్: విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించేలా బోధన చేయాలని ఎంఈఓ అనితాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రాంపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయుల టీచింగ్‌ను పరిశీలించారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బిక్షం, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, ప్రసన్నవాణి, గుర్రం వెంకన్న, రవికుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

డోర్నకల్: ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సీరోలు మండల వ్యవసాయ అధికారి చాయారాజ్ హెచ్చరించారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో శుక్రవారం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

మహబూబాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యకారులను ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బి.లింగన్న డిమాండ్ చేశాడు. ఉద్యమకారుల ఫోరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో శంతన్ రామరాజు, నారాయణ సింగ్, రామ్, శ్రీను, హన్మంత్ పాల్గొన్నారు.

రైతులకు సేవలందించడమే లక్ష్యం

గూడూరు: రైతులకు సేవలందించడమే లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం మహాజన సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నేరుగా సొసైటీకి వచ్చి రుణాలు పొందాలని, మధ్య దళారీలను ఆశ్రయించరాదని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మహబూబాబాద్ అర్బన్: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుత్తమాల మురళీధర్‌స్వామి ఉద్యోగ పదవీ విరమణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండి పులయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, రాంమోహన్‌రెడ్డి, వెంకన్న, డీఈఓ రాజేశ్వర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ వేణు మాధవ్, నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

గూడూరు: అడవుల రక్షణకోసం ప్రాణాలను సహితం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించే అటవీశాఖ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ విక్రమ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఫారెస్టు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణు, రమేష్, కవిత, సత్యం పాల్గొన్నారు.

కాపర్ తీగ చోరీ?

చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి గ్రామ శివారులో విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ని గురువారం తీసుకొచ్చారు. శుక్రవారం అమర్చాల్సి ఉండగా విద్యుత్ సిబ్బంది వచ్చేసరికి ట్రాన్స్‌ఫార్మర్ విడిభాగాలుగా విడదీసి ఉంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ తీగ చోరీ జరిగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యశిబిరం

డోర్నకల్: స్థానిక మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శివ బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వానా, తదితరులు పాల్గొన్నారు.

జాడలేని పాత రుణాలు

దళిత, గిరిజనుల ఎదురుచూపులు

- ఆగమ్య గోచరంగా సంక్షేమ పథకాలు
- ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



మహబూబాబాద్ అర్బన్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దళిత, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలను పెంచడానికి వారి ఆర్థిక అభివృద్ధిని మేరుగు పరచడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్సీ సబ్ ప్లాన్ పథకం ఆచరణలో విఫలమవుతుంది. వారి వ్యాపారాల కోసం అందించే రుణాల నిధులు విడుదలలో జాప్యం అవుతుందని ఎస్సీ వర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. 2018–2019 ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఆ బడ్జెట్‌లోని ఎస్సీ రాయితీ డబ్బు ఇప్పటి వరకు బ్యాంకులకు చేరలేదు. ఇందులో గ్రౌండింగ్ అయిన యూనిట్లు ఉన్నాయి. ఇంకా చాలా యూనిట్లకు నిధులు విడుదల కావాల్సి ఉంది. 2018–19కు సంబంధించిన రూ.50వేల రుణం 242 మందికి మాత్రమే వార్షిక ప్రణాళికను ఏడాది ఆలస్యంగా విడుదల చేసి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. రూ.లక్షపైన రుణాలు 119మంది దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం 82మంది మాత్రమే అర్హులయ్యారు. వీరికి రూ.కోటి.3లక్షల నిధులు విడుదల కావాల్సింది. నేటికి ఆ రుణాలు అందలేదు. మరి 2020–21కు ఆర్థిక సంవత్సరం మహబూబాబాద్ జిల్లాకు 16 మండలాలకు కలిపి 301 యూనిట్లు కేటాయించారు. వీటివిలువ సుమారు రూ.4 కోట్లు 86లక్షలు ఉంటుంది. యూనిట్లు స్వయం ఉపాధి కొరకు ఎంపిక చేసినవి కాగా సబ్సిడీ విషయంలో ఎలాంటి మార్పులేదు. ఇలా ఎస్సీ రుణాల కోసం దళితులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దళితులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలని పలువురు దళితులు కోరుతున్నారు.

రూ.2లక్షలకు దరఖాస్తు చేసుకున్న



2018లో ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం రూ.2లక్షలకు దరఖాస్తు చేసుకొని ఆరేళ్లు అవుతుంది. బ్యాంక్ అధికారులు చెప్పిన పేపర్లు అన్ని కార్యాలయంలో, సంబంధించిన బ్యాంక్‌లో అందించాను. ఇప్పటి వరకు ఎలాంటి రుణం ఇవ్వలేదు. ఇప్పుడైన రుణం అందిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతాను.

– పుచ్చకాయల ఉపేందర్, హరిజనవాడ, మానుకోట

కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి



మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు



తొర్రూరు: నివాళులర్పిస్తున్న ఆర్డీఓ నర్సింగరావు, తదితరులు



కేసముద్రం: మార్కెట్‌లో..



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయ నాయకుడిగా, సామాజిక సేవకుడిగా ఊపిరి ఉన్నంత వరకు ప్రజల పక్షాన నిలిచి బాపూజీ పోరాడారని గుర్తు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

జమిలి ఎన్నికలు దేశానికి ప్రమాదకరం



మాట్లాడుతున్న సోమయ్య

నెహ్రూసెంటర్: జమిలి ఎన్నికలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం హన్మంతనగర్ మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో శాశ్వతంగా అధికారాన్ని అనుభవించేందుకు మోదీ జమిలి ఎన్నికలను తెరమీదకు తీసుకువస్తున్నారని విమర్శించారు. అధ్యక్ష తరహా విధానాన్ని దేశంలో తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో అల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిపిరి యాకయ్య, నాగన్న, సుధాకర్, భాగ్యమ్మ, రాములు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ



డోర్నకల్: మండల విద్యాశాఖ అధికారిగా నియమితులైన తాడేళ్లగూడెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఆంగోత్ లక్ష్మా శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించి అభినందించారు.

నెల్లికుదురు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నెల్లికుదురు ఎంఈఓగా రాందాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హెచ్‌ఎంలు పుష్పగుచ్ఛం అందించి ఎంఈఓను సన్మానించారు.

దంతాలపల్లి: మండల విద్యాశాఖాధికారిగా మండలంలోని పెద్దముప్పారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నర్సింహులపేట: నర్సింహులపేట ఎంఈఓగా హైస్కూల్ హెచ్‌ఎం రామ్మోహన్‌రావు శుక్రవారం విధుల్లో చేరారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే ‘హైడ్రా’



మాట్లాడుతున్న రాజన్న

మహబూబాబాద్ రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజల దృష్టి మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘హైడ్రా’ను తీసుకువచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న విమర్శించారు. మండలంలోని జంగిలిగొండలో పార్టీ 4వ మహాసభ శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గునిగంటి రాజన్న హాజరై మాట్లాడారు. వ్యవసాయ రాయితీలు రైతులకు అందకుండా భూ యజమానులకు దక్కుతున్నాయన్నారు. పార్టీ కార్యకర్తలు నిస్వార్థంగా పనిచేయాలన్నారు. వర్గ సమస్యలను తీసుకుని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కుర్ర మహేష్, మండల కార్యదర్శి దుడ్డెల రామూర్తి, మల్లయ్య, సుభద్ర, వెంకటేశ్వర్లు, కుమార్, జయమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మహబూబాబాద్: ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ వాడకం కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రీన్ టీం వర్కర్ వినయ్, శ్రీకాంత్ వినూత్నంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం క్యాన్సర్‌కు దారి తీస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈలు సురేష్, కుమార్, డీఎంసీ విజయ, గుజ్జు క్రాంతి పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని ఎల్‌బీజీనగర్, గిరిప్రసాద్‌నగర్, రాహుల్‌నగర్ కాలనీలకు విద్యుత్ మీటర్లు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ డీఈ విజయ్‌కి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బానోత్ సీతారాంనాయక్, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధుల కోతలు



నెల్లికుదురు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నెల్లికుదురు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి నిధులు కోత పెడుతూ ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుస్తున్నారని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు బానోతు నందీశ్వర్, కార్యదర్శి భూక్య రాంచరణ్ అన్నారు. ఈనెల 30న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించే 50వసంతాల సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాల ఆవరణంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోమన్న, రాము. దేవేందర్, బాలు, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్ /బయ్యారం: మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం పీడీఎస్‌యూ 50వసంతాల పోస్టర్ ఆవిష్కరణ సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ దేవేందర్, విద్యార్థులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు కల్యాణి, ప్రవళిక, మంజుల, హేమదేవి, సంధ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

కురవి: 317జీఓ బాధిత ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాష్టి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మొగిలిచర్ల, పెద్ద తండా, గుండ్రాతిమడుగు(విలేజి), రాజోలు, బలపాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న జెడ్పీ జీపీఎఫ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బొల్లం శ్రీనివాస్, గుండ్ల విజయ్‌కుమార్, ఓడెల శివకుమార్, జి.మురళీ, సీహెచ్.శ్రీనివాస్, జి.కార్తీక్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాను విజయవంతం చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పర్వత కోటేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు.

కులమతాలకు అతీతంగా పోరాడాలి

బయ్యారం: ప్రజలంతా కులమతాలకు అతీతంగా పోరాడాలని మాస్‌లైన్ జిల్లా నాయకులు జగ్గన్న, మండల కార్యదర్శి సూర్యం అన్నారు. ఈనెల 30వరకు సత్యశోధక్ సమాజ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

ఉద్యోగ అవకాశం కల్పించాలి

తొర్రూరు: వయసు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వీఆర్‌ఏల వారసులు కోరారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొండ ఉప్పలయ్య, సీహెచ్ కుమార్, ప్రశాంత్, యాకన్న, మురళి, మల్లయ్య, వెంకటయ్యలు పాల్గొన్నారు.

29న యాదవ మహాసభ రాష్ట్ర సదస్సు

నెహ్రూసెంటర్/గార్ల: ఈనెల 29వ తేదీన ఖమ్మంలో జరిగే యాదవ మహాసభ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ శుక్రవారం పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం

కొత్తగూడ: పది సంవత్సరాలు అటవీ శాఖలో స్ట్రైకింగ్ ఫోర్స్‌లో పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జబ్బ రామారావు(40) కుటుంబానికి ఫారెస్ట్ అధికారులు రూ.36,500ల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విక్రమ్, సత్యం, విష్ణు, బిక్కు పాల్గొన్నారు.

‘మైక్రోస్కోప్’ బహూకరణ

మరిపెడ రూరల్: మండలంలోని రాంపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దాత రామసహాయం మైపాల్‌రెడ్డి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే ‘సైన్స్ మైక్రోస్కోప్’ను శుక్రవారం బహూకరించాడు. కార్యక్రమంలో ఎంఈఓ అనితాదేవి పాల్గొన్నారు.

సన్మానం



మహబూబాబాద్ రూరల్: అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన మానుకోటకు చెందిన ఉపాధ్యాయురాలు నూకల గీతను చిన్ననాటి స్నేహితులు గురువారం రాత్రి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంతన్ రామరాజు, జెన్నారెడ్డి శ్రీనివాస్, ఆకుల హైమావతి, ఆగుర్తి రాజేందర్ పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్ ద్వారా బియ్యం ఇవ్వాలి

మరిపెడ రూరల్: వేయింగ్ మిషన్ ద్వారా తూకం పెట్టి పీడీఎస్ బియ్యం రేషన్‌షాపులకు సప్లయ్ చేయాలని రేషన్ డీలర్ల సంఘం మరిపెడ, చిన్నగూడూరు మండలాల అధ్యక్షులు అనంతుల వెంకన్న, గాడిపెల్లి సత్యనారాయణ డిమాండ్ చేశాడు. ఈమేరకు మరిపెడ ఎఫ్‌సీఐ గోడౌన్ ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

పట్టణ అధ్యక్షుడిగా విజయరాముడు



గార్ల: పట్టణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా తోడేటి విజయరాముడు గౌడ్‌ను గౌడ కులస్తులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కులగణన చేసి ఎన్నికలు నిర్వహించాలి

కొత్తగూడ: కులగణన చేసి వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమొక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి శ్రీశైలం డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు యాదగిరి యుగెందర్, మంగన్న పాల్గొన్నారు.

భూములను లాక్కోవద్దు

నెహ్రూసెంటర్: నూకల రాంచంద్రారెడ్డి విగ్రహం పేరా గిరిజన రైతుల భూములను తీసుకోవద్దని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, కాంగ్రెస్ కౌన్సిలర్ బానోత్ హరిసింగ్ అన్నారు. కలెక్టర్, తహసీల్దార్‌కు గిరిజన రైతులతో కలిసి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కల్యాణ్, నరేష్, సోమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గార్ల: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ వీరభద్రం సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గార్ల హైస్కూల్లో నిర్వహించే క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసరావు, అప్పయ్య, హెచ్‌ఎం పోట్ల నాగేశ్వరరావు, వీరునాయక్, శివనాయక్, రమేష్, సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పోషణమాసం

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో శుక్రవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో పెనుగొండ గ్రామంలో పోషణమాసం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ ఉదయశ్రీ, సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, రాజమణి, పుష్పలీల పాల్గొన్నారు.

పెద్దవంగర: అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య నిలయాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవాతరుణి అధ్యక్షురాలు మాధవపెద్ది వాణి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బావోజీ తండాలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ నిర్వహించారు.

దర్గయ్య మృతి తీరనిలోటు

కురవి: మండలంలోని బలపాల మాజీ సర్పంచ్, సీపీఎం నాయకుడు పిట్టల దర్గయ్య(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌తోపాటు నాయకులు పిట్టల దర్గయ్య మృతదేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రాజు, సోమయ్య, రాజన్న, వీరనయ్య పాల్గొన్నారు.

బాధితులకు దుప్పట్లు, చీరల పంపిణీ



కురవి: దుప్పట్లు పంపిణీ చేస్తున్న భరత్‌చందర్‌రెడ్డి

కురవి: హైదరాబాద్‌కు చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా–301 రీజియన్ 9, మూడవ ఏరియాకు చెందిన బాధ్యులు మండల కేంద్రంలో వరద బాధితులకు దుప్పట్లు, చీరలు, టీషర్టులను కాంగ్రెస్ అధ్యక్షుడు జిల్లా జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ సూచనల మేరకు కురవికి చెందిన వద్దుల కృష్ణారెడ్డి మిత్రబృందం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.శ్రీనివాసాచారి, నాగభూషణం, విజయలక్ష్మి, సంపత్‌రెడ్డి, ప్రసాద్, చక్రపాణి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం పంపిణీ

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో వరద ముంపు బాధితులకు శుక్రవారం బియ్యం పంపిణీ చేశారు. గ్రామంలోని 131మంది ముంపు బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రుక్మాంగదరరావు, ఎంపీఓ మున్వర్‌బేగ్, కార్యదర్శి శశిధర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఆటోను ఢీకొన్న డీసీఎం.. ఇద్దరికి గాయాలు

కురవి: ఆటోను డీసీఎం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి కురవిలోని 365 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మోద్గులగూడెంకు చెందిన రాందాస్ అనే వ్యక్తి ఆటో మహబూబాబాద్ నుంచి కురవికి వస్తుంది. ఆటో కురవిలోని పెద్ద మోరీల వద్దకు చేరుకునే సమయంలో ఓ లారీ ముందు ఉన్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న బెస్త వెంకటయ్యకు, డ్రైవర్ రాందాస్‌కు గాయాలయ్యాయి. మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి..

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన శంకరబోయిన ఉప్పలయ్య శుక్రవారం భార్యతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా వానర గుంపు అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి పడిపోయింది. దీంతో ఉప్పలయ్య ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని వంతడపల గ్రామానికి చెందిన ముండ్ల మహేష్ అనే యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన గడ్డం కల్పన అనే యువతిని మహేష్ ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ఘటనలో బాధితురాలు ఫిర్యాదు మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా మనస్తాపంతో కల్పన శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక డంప్ సీజ్

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేటలో అక్రమంగా నిల్వచేసిన 5ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను శుక్రవారం సాయంత్రం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

మహిళను కాపాడిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్: ఆత్మహత్య చేసుకుందామనుకున్న ఓ మహిళను సివిల్, జీఆర్పీ పోలీసులు కాపాడిన సంఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో శుక్రవారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఆ సమయంలో అక్కడే ఉన్న టౌన్ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ సదరు మహిళ పరిస్థితిని గమనించి ఆమె వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి భర్త, తల్లిదండ్రులకు తెలియజేసి, ఇంటికి పంపించారు.

గందరగోళం మధ్య గ్రామసభ

కురవి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అత్యవసరంగా శుక్రవారం పంచాయతీ స్పెషల్ అధికారి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభ గందరగోళంగా జరిగింది. కురవిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మరమ్మతుల పనుల కోసం మంజూరైన రూ.20లక్షల పనులకు వీడీసీ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సంగెం భరత్, దుడ్డెల వినోద్, ఇరుగు వెంకన్నలు అధికారులతో వాదనకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మిర్యాల లక్ష్మయ్య జోక్యం చేసుకుని పనులను చేసేందుకు నారాయణ రాజేందర్‌కుమార్ పేరును ప్రతిపాదించారు. వీడీసీ కమిటీలో శ్రీరామోజు నాగరాజు, తురక రమేష్, భరత్, ఇరుగు వెంకన్నల పేర్లను ప్రతిపాదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, కార్యదర్శి విజయలక్ష్మీ పాల్గొన్నారు.